# దానిమ్మ సాగులో అగ్రస్థానం మనదే




సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభాకర్ చందాని

## ఉత్పత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు ప్రభాకర్‌చందాని

గద్వాల రూరల్, గద్వాలటౌన్, మార్చి 5 (న్యూస్‌టుడే): దానిమ్మ ఉత్పత్తిలో ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలో మొదటి స్థానంలో ఉందని జాతీయ దానిమ్మ ఉత్పత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు ప్రభాకర్ చందాని పేర్కొన్నారు. జాతీయ ఉద్యానవనాల శాఖ, రాష్ట్ర దానిమ్మ ఉత్పత్తిదారుల సమాఖ్య, జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆదివారం గద్వాలలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన దానిమ్మ తోటల పెంపకం... యాజమాన్య పద్ధతులు అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రస్తుతం ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే దానిమ్మలో 60 నుంచి 70 శాతం దాక మనదేశంలో పండుతుందని... భవిష్యత్తులో ఇంకా పెరిగే అవకాశముందని తెలిపారు. రైతులకు యజమాన్యం - సమస్యలపై ఇక్కడి శాస్త్రవేత్తలు సందేహాలు తీరుస్తున్నారని తెలిపారు. గద్వాల ప్రాంతంలో 'భగువ'రకం దానిమ్మను పండిస్తున్నారని ఈ రకానికి మంచి డిమాండ్ ఉందని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో దానిమ్మ సాగులో బ్యాక్టీరియా వలన రైతులు పంట నష్టపోతున్నారని స్థానికంగా దానిమ్మ పరిశోధన కేంద్రం ఏర్పాటయితే రైతులు కష్టాలు తొలగిపోతాయని తెలిపారు. దానిమ్మలో నర్సరీ నుంచి మొక్క పెరిగే వరకు ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున రుణాలపై సబ్సిడీలు లభిస్తున్నాయని రైతులు వాటిని సద్వినియోగం చేసుకునాలని కోరారు. సాంప్రదాయ పంటలను తగ్గించి దానిమ్మ తరహా పంటలపై రైతులు ఆసక్తిని చూపాలని తద్వార మెరుగైన లాభాలను సాధించవచ్చని ప్రభాకర్‌చందాని పేర్కొన్నారు.

### నాణ్యమైన పంటకే ధర

ప్రస్తుతం దానిమ్మకు ఎంతో మంచి డిమాండ్ ఉందని అయితే నాణ్యమైన పంటకే మంచి ధర లభిస్తోందని శాస్త్రవేత్త డాక్టర్ కులకర్ణి పేర్కొన్నారు. సస్య రక్షణ పద్ధతులపై సరైన అవగాహన పెంపొందించుకునాలని రైతులకు సూచించారు. స్థానికంగా దానిమ్మ రైతుల సమాఖ్యలను ఏర్పాటు చేసుకోవాలని తద్వార శాస్త్రవేత్తలను, అభ్యుదయ రైతులను అందరూ కలిసే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ఇక ప్రభుత్వం క్రమం తప్పక తెగుళ్లు, పురుగులపై రైతులకు సమాచారం అందించాలని సూచించారు.

### గద్వాల రైతుల ముందడుగు

ఎమ్మెల్యే డి.కె. అరుణ మాట్లాడుతూ జిల్లాలోనే గద్వాల ప్రాంత రైతులు హార్టికల్చర్‌లో మంచిపేరు సంపాదించారన్నారు. ఇక్కడ ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని హార్టికల్చర్‌లో మరింత దిగుబడిని సాధించాలని సూచించారు. మార్కెటింగ్ వ్యవస్థను మెరుగు పర్చుకుని ఇతర దేశాలకు పండ్ల ఉత్పత్తులను ఎగుమతి చేయాలన్నారు. పండ్ల తోటల పెంపకంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడిని సాధించాలన్నారు.

### రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

దానిమ్మ రైతులు ప్రభుత్వం నుంచి అందే వివిధ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖ జె.డి.ఎ. జగదీశ్వర్‌రెడ్డి కోరారు. గతంలో కేవలం దానిమ్మ మొక్కలపై మాత్రమే రాయితీలు ఉండేవని ప్రస్తుతం నర్సరీ నుంచి 3 సంవత్సరం వరకు రాయితీలు వర్తిస్తున్నాయని తెలిపారు. రైతులు గ్రేడింగ్, ప్యాకింగ్‌లలో అనుభవం సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జగదీశ్వర్, గద్వాల ఆర్డీవో సుధాకర్‌రావు, జాతీయ దానిమ్మ పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ పి.కుమార్, శాస్త్రవేత్త డాక్టర్ కె.కె.శర్మ, డైరెక్టర్ పి.సుధాకర్‌రావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ నందిన్నె ప్రకాష్‌రావు, రాష్ట్ర దానిమ్మ ఉత్పత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు బద్రినాథ్, గద్వాల ఎంపీపీ ఏకాంబర్‌రెడ్డి, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

చేస్తున్న అంతర్జాతీయ విమానాశ్రమం కూడా సహాయిపడుతున్నదన్నారు.

రైతులు జెసి రంగారెడ్డి, పద్మారెడ్డిలు పాల్గొన్నారు.